క్లుప్తంగా

స్వచ్ఛ ఓటర్ల జాబితాకు సహకరించాలి

పామర్రు: స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారు చేసేందుకు అందరూ సహకరించాలని పామర్రు నియోజకవర్గ ఆర్వో శ్రీనివాసరావు కోరారు. మండల పరిధిలోని పసుమర్రు, పరిశేపల్లి తదితర గ్రామాల్లోని బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్వేను ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్వో మాట్లాడుతూ.. ఓటర్ల జాబితా సవరణ ఈనెల 21వ తేదీ వరకు జరుగుతుందన్నారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితాను పరిశీలించాలని చెప్పారు. అనంతరం స్థానిక సచివాలయంలో కాపునేస్తం దరఖాస్తులను ఆయన పరిశీలించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ రాము, వీఆర్వో సాయిబాబు, స్థానికులు పెరుమాళ్ల రాధాకృష్ణ పాల్గొన్నారు.

మండవల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో 49 మంది బూత్‌లెవెల్ అధికారులతో రిటర్నింగ్ అధికారి, డెప్యూటీ కలెక్టర్ కె.బాబ్జీ గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్వోలు ఓటర్ల జాబితా సవరణలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, ఎలక్షన్ డీటీ ఇబ్రహీం, బీఎల్వోలు పాల్గొన్నారు.

వీఆర్వో పోస్టులను వీఆర్ఏలతో భర్తీ చేయాలి



కైకలూరు: రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వీఆర్వో పోస్టులను అర్హత కలిగిన వీఆర్ఏలతో భర్తీ చేయడంతో పాటు 60 ఏళ్లు పైబడిన వీఆర్ఏల స్థానంలో వారి వారసులకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణను వీఆర్ఏలు గురువారం కోరారు. ఈ మేరకు ఆటపాక కార్యాలయం వద్ద వినతి పత్రాన్ని అందజేశారు. ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం పిలుపు మేరకు జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు కె.బ్రహ్మాజీ, కె.ప్రేమ్‌చంద్ వీఆర్ఏల సమస్యలను ఎమ్మెల్సీకి వివరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానని ఆయన చెప్పారు. నియోజకవర్గంలోని వీఆర్ఏలు పాల్గొన్నారు.

నేడు సున్నా వడ్డీ పథకం నగదు జమ

కైకలూరు: నియోజకవర్గంలో వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా 4వ ఏడాది నగదును ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం జమ చేయనున్నారు. నియోజకవర్గంలో మొత్తం డ్వాక్రా సంఘాలు 5,680 ఉండగా వీటికి రూ.7 కోట్ల 22 లక్షల 31 వేలు చెల్లించనున్నారు. కైకలూరు వెలుగు కార్యాలయంలో ఉదయం 11 గంటలకు జరుగు సున్నా వడ్డీ పథకం కార్యక్రమానికి ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ హాజరవుతారని ఏపీఎం సత్యనారాయణ చెప్పారు.

పేరెంట్స్ కమిటీ సమావేశాలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పేరెంట్స్ కమిటీ సమావేశాలు గురువారం జరిగాయి. ఈ సమావేశాల్లో విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. ఇటీవల ఎఫ్ఎ-1 పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షల మార్కులకు సంబంధించి విద్యార్థులు చూపిన ప్రతిభను సమావేశాల్లో చర్చించారు. విద్యార్థుల స్థాయిని మరింత పెంచడానికి చేపట్టాల్సిన చర్యలను తల్లిదండ్రులకు ఉపాధ్యాయులు వివరించారు.

ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

గుడివాడటౌన్: సత్యనారాయణపురంలోని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కార్యాలయంలో 50వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో రాజీపడకుండా పోరాటం చేస్తున్నామన్నారు. నాయకులు శ్రీనివాసరావు, ఎల్.నరేంద్ర, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్.ఆంజనేయులు, కె.చంద్రశేఖర్, సతీష్, బోయాజ్, హరిశ్రీనివాస్, పీటర్, అమ్మన్నబాబు, మీరాహుస్సేన్, పాషా, మురళి, రాజేష్ పాల్గొన్నారు.

గీత కార్మికుడిని ఆదుకోవాలి

మొవ్వ: తాటి చెట్టు పై నుంచి కింద పడిన కల్లుగీత కార్మికుడు బోలెం సుబ్బారావును ఆదుకోవాలని ఏపీ కల్లు గీత కార్మిక సంఘం కృష్ణా జిల్లా కమిటీ అధ్యక్షుడు వాకా రామచంద్రరావు కోరారు. ఈ మేరకు మొవ్వ ఆర్ఐ విజయలక్ష్మికి గురువారం అర్జీని అందజేశారు. సుబ్బారావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడని, తక్షణమే ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో పెదపూడి సొసైటీ అధ్యక్షుడు తాతా పోతురాజు, కౌలు సంఘం నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం

- ఎమ్మెల్యే డీఎన్నార్
- వాడవాడలా నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీ

కైకలూరు: విద్యార్థుల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆటపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను ఎమ్మెల్యే గురువారం అందించారు. ముందుగా నులిపురుగుల నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఏడాది నుంచి 19 ఏళ్ల వరకు బాలబాలికలకు కచ్చితంగా నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పీహెచ్‌సీల సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఇటీవల ట్రిపుల్ ఐటీలకు ఎంపికైన విద్యార్థులు శివాణి, శ్యామల, మహేష్‌లను అభినందించారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, ఏఎంసీ చైర్‌పర్సన్ దండే పుష్పలత, కైకలూరు సర్పంచ్ దానం మేరీ నవరత్న కుమారి, మండల సర్పంచ్‌ల ఫోరమ్ అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు, ఎంపీటీసీ పట్టపు బాలమ్మ, ఎంఈవో-2 వి.శ్రీనివాసరావు, స్కూల్ ఇన్‌చార్జి హెచ్‌ఎం ముబిన్‌ఖాను, కొల్లేటికోట పీహెచ్‌సీ డాక్టర్లు శంకర్, కిరణ్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

90 శాతం పంపిణీ

ముదినేపల్లిరూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు గురువారం పంపిణీ చేశారు. ముదినేపల్లి, గురజ, దేవపూడి పీహెచ్‌సీల పరిధిలోని సిబ్బంది పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేసి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ పీహెచ్‌సీల పరిధిలో 4,550 మందికి మాత్రలు పంపిణీ చేయాలని లక్ష్యం కాగా 90 శాతం పైగా పూర్తయినట్లు వైద్య శిబ్బంది తెలిపారు.



విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను వేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లిలో..

మండవల్లి: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల-1, అంగన్‌వాడీ సెంటర్-4 నందు సర్పంచ్ మెండా ఝాన్సీ విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. విద్యార్థుల ఆరోగ్యం సక్రమంగా ఉంటేనే చదువుపై శ్రద్ధ వహిస్తారన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్, ఎంపీపీ స్కూల్ హెచ్‌ఎం పి.ప్రతాప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నులి పురుగుల మందులు స్వీకరించాలి

గుడివాడటౌన్: మనిషి ఎదుగుదలలో హాని కలిగించే నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు ఎంతగానో ఉపయోగపడతాయని బాపూజీ నగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ వైద్యుడు గంటా ట్విన్‌సన్ అన్నారు. 15వ వార్డు మున్సిపల్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు నులిపురుగు నివారణ మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం టి.భవానిశంకర్, కమ్యూనిటీ సెంటర్ ఆర్గనైజర్ వి.రామారావు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గుడివాడలో ట్యాబ్లెట్ వేస్తున్న వైద్యులు, వైద్య సిబ్బంది

నులి పురుగులను నివారిస్తే మంచి ఆరోగ్యం

పామర్రు: గ్రామంలోని 20వ వార్డు బాపూజీ పేటలోని అంగన్‌వాడీ కేంద్రంతో పాటు అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు నులి పురుగుల నివారణ మందులను అందజేశారు. వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు పాల్గొని చిన్నారులకు మాత్రలను అందించారు. కార్యక్రమంలో పరసా కిషోర్, ఈడే అశోక్, పామర్తి వీర వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మి, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో..

కూచిపూడి(మొవ్వ): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు మండల వైద్యాధికారి ఎం.వేదరాజ్ ఆధ్వర్యంలో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఒకటి నుంచి రెండేళ్ల లోపు చిన్నారులకు అర ట్యాబ్లెట్, 2 నుంచి 19 ఏళ్లలోపు వారికి పూర్తి ట్యాబ్లెట్‌ను భోజనం తరువాత వేసుకోవాలని, ఇలా ప్రతి ఆరునెలలకు ఓ సారి వేసుకోవటం వలన నులిపురుగులను నివారించ వచ్చునని సూచించారు. కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర జిల్లా పరిషత్ పాఠశాలలో గ్రామ సర్పంచ్ కె.వెంకటరమణ విజయలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాత్రలు పంపిణీ చేశారు. హెచ్‌ఎం సత్యప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ కె.రామాంజనేయులు, సీహెచ్‌వో దివ్య, ఏఎన్‌ఎం జి.సమిత, ఆశావర్కర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



పామర్రులో మాత్రలను వేస్తున్న వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు

డీ వర్మింగ్ 96 శాతం పూర్తి

కైకలూరు: మండలంలో కొల్లేటికోట, శీతనపల్లి పీహెచ్‌సీ పరిధిలో 96 శాతం నులిపురుగుల నివారణ మందును పంపిణీ చేశామని వైద్యులు శంకర్, సీహెచ్.హేమలత గురువారం చెప్పారు. ఏడాది నుంచి 19 ఏళ్ల యువతీ యువకులు 14,746 మంది ఉండగా వీరిలో 14,104 మందికి డీ వర్మింగ్ మాత్రలను అందించారు. తామరకొల్లు హైస్కూల్‌లో వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ భట్రాజు శివాజీ బాలికలకు మాత్రలను అందజేశారు. మిగిలిన వారికి ఈ నెల 17 నాటికి అందిస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అన్నపూర్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ సివిల్ జడ్జిగా బండి రచన



గుడివాడటౌన్: గుడివాడకు చెందిన న్యాయవాది బండి రచన జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. పట్టణంలో న్యాయవాదులుగా పనిచేస్తున్న బండి శరత్‌బాబు-గీత దంపతుల కుమార్తె రచన గతేడాది విశాఖపట్నంలోని దామోదర సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో న్యాయశాస్త్ర పట్టా అందుకున్నారు. అనంతరం హైకోర్టులో సెక్షన్ ఆఫీసర్‌గా ఉద్యోగం సంపాదించిన రచన గతంలో జరిగిన జూనియర్ సివిల్ జడ్జి పరీక్షల్లో ఉత్తీర్ణురాలై, ముఖాముఖి పరీక్షలోనూ విజయం సాధించారు. ఆమెకు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

నిమ్మకూరు(పామర్రు): ప్రస్తుతం ఉన్న చట్టాలపై మహిళలు అవగాహన పెంచుకోవాలని మచిలీపట్నం సీనియర్ సివిల్ జడ్జి కె.వి.రామకృష్ణయ్య అన్నారు. నిమ్మకూరు గ్రామంలోని తారక రామారావు నైపుణ్యాభివృద్ధి, మహిళా సాధికారత కేంద్రాన్ని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కృష్ణాజిల్లా సభ్యులు గురువారం సందర్శించారు. కేంద్రంలోని స్వధార్ గృహాల్లో ఉంటున్న మహిళలతో అక్కడి వసతులు, సౌకర్యాలపై ఆరా తీశారు. నేటి తరం యువతులకు మహిళలకు న్యాయపరమైన అంశాలను తెలుసుకోవడానికి చట్టాలు ఎంతగానో ఉపయుక్తమవుతాయన్నారు. న్యాయపరమైన సమస్యలు వచ్చినప్పుడు ఈ చట్టాలను వినియోగించవచ్చని చెప్పారు. ప్రాంగణం జిల్లా మేనేజర్ డాక్టర్ ఎస్.జుబేదా పర్వీన్, డీపీహెచ్ఎన్‌డీ దీవెనమ్మ, శిక్షకులు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గడప గడపలో ప్రజల సంతోషమే ధ్యేయం

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పామర్రు: ప్రతి ఇంట్లో సంతోషాలు నెలకొల్పాలనే ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి అందిస్తున్నారని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని రాపర్ల సచివాలయం పరిధి ఉరుటూరు గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్తుల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ప్రభుత్వ పథకాలను వివరిస్తూ, సంక్షేమ పథకాల లబ్ధి పత్రాలను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం జగన్ పాలన అందిస్తున్నారన్నారు. పేదలు అభ్యున్నతి చెందితే రాష్ట్రం అభివృద్ధి సాధించినట్లే అని నమ్మిన ఏకైక ప్రభుత్వం తమదని చెప్పారు. నవరత్న పథకాలను ప్రవేశపెట్టి, అర్హతే ప్రామాణికంగా కుల, మత, ప్రాంత, పార్టీ అని బేధాలు లేకుండా లబ్ధిదారులకు పథకాలు అందిస్తున్నామన్నారు. మండల సచివాలయ కన్వీనర్ ముప్పిడి సురేష్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీలు తాడిశెట్టి శ్రీనివాసరావు, పి.రత్నకుమారి, కోఆప్షన్ సభ్యుడు హస్మతుల్లా, మండల ఆర్బీకే అధ్యక్షుడు ఏ.శ్రీనాథ్‌రెడ్డి, సర్పంచ్ ఎం.శ్రీనవత, నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, పెయ్యల రాజు, కాకర్ల శివశంకర్, నందిరాజు, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తోట్లవల్లూరు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించటమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని భద్రిరాజుపాలెంలో గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం గురువారం సాయంత్రం కోలాహలంగా ప్రారంభమైంది. తొలుత ఎస్సీ వాడ వద్ద మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాలకు ఎమ్మెల్యే కైలే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ఆయన గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించటంతోపాటు బ్రోచర్లను పంపిణీ చేశారు. గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకోవటంతోపాటు ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, సర్పంచ్ కొక్కిలిగడ్డ హేమలత, వైస్ ఎంపీపీలు కళ్లం శివారెడ్డి, మెల్లంపల్లి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు చాగంటి శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ చాగంటి తిరుమలరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ నడకుదురు రాజేంద్ర, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, తహసీల్దార్ కుసుమకుమారి, ఎంపీడీవో తుంగల స్వర్ణలత, ఇన్‌చార్జి కార్యదర్శి సత్యనారాయణ, వివిధ గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులు గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



భద్రిరాజుపాలెంలో ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

వర్షాలతో దెబ్బతిన్న రైతులకు విత్తనాల పంపిణీ

గుడివాడరూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో దెబ్బతిన్న నారుమడుల్లో మరలా విత్తనాలను నాటుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం నారు వచ్చే విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మి తెలిపారు. మండలంలోని మోటూరు, నాగవరప్పాడు రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. 80 శాతం సబ్సిడీతో విత్తనాలను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ



ముదినేపల్లిరూరల్: మండలంలోని వణుదుర్రు పంచాయతీ సర్పంచ్, పెయ్యేరు పంచాయతీ 2వ వార్డు సభ్యుని ఎంపికకు నిర్వహించిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ గురువారంతో ముగిసింది. వణుదుర్రు సర్పంచ్ పదవికి 9 మంది, పెయ్యేరు పంచాయతీ 2వ వార్డు సభ్యుడి ఉప ఎన్నిక కోసం ముగ్గురు నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో పి.మల్లీశ్వరీ తెలిపారు. వణుదుర్రు సర్పంచ్ పదవికి చిన్నం సుగుణబాబును వైఎస్సార్ సీపీ బలపరిచింది. పార్టీ నియోజకవర్గ నేత దూలం ఆది వినయ్‌కుమార్, ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ సుగుణబాబుతో స్థానిక సచివాలయంలో రిటర్నింగ్ ఆఫీసర్ ఎదుట నామినేషను దాఖలు చేయించారు. నామినేషన్ ప్రక్రియలో హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు కోమటి విష్ణువర్ధన్, బొర్రా శేషుబాబు, లేళ్ల ఆంజనేయులు, ఈడే పూర్ణ, తాడంకి ఏసుబాబు, తోకల నాగరాజు, దారం సుబ్బారావు, భాస్కరరావు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలం పుట్టగుంట గ్రామంలోని 9వ వార్డుకు రెండు నామినేషన్లు వచ్చినట్లు ఎన్నికల అధికారి టి.విజయ్ తెలిపారు. శుక్రవారం స్క్రూటినీ, 12న అభ్యంతరాల స్వీకరణ, 13న దరఖాస్తుల తిరస్కరణ, 14న ఉపసంహరణకు తుది గడువన్నారు. ఎన్నికలు అనివార్యమైతే 19వ తేదీ ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఎన్నిక కొనసాగుతుందని అదేరోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెల్లడిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు.

వీరంకిలాకు ఉద్యాన నర్సరీకి పూర్వవైభవం

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ప్రజా సమస్యల పరిష్కార దిశగా పనిచేయాలని అధికారులకు సూచన

పమిడిముక్కల: జిల్లాలో పేరొందిన వీరంకిలాకు నర్సరీకి పూర్వవైభవం తీసుకొస్తానని ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ హామీ ఇచ్చారు. నిరుపయోగంగా మారిన ఈ ఉద్యాన నర్సరీని అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకొంటానని తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కాసాని వేదసుప్రజ అధ్యక్షతన గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలంలోని పలు సమస్యలపై చర్చించారు. తాడంకిలో ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించి, పేదలకు త్వరితగతిన ఇళ్ల పట్టాలు అందించాలని తహసీల్దార్ రాజ్యలక్ష్మికి సూచించారు. ఈ సమస్యపై తాను జేసీతో మాట్లాడతానని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలను గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ప్రజలకు తాగునీరందించే విషయంలో రాజకీయాలు చేస్తే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని పమిడిముక్కల కార్యదర్శిని హెచ్చరించారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు చెప్పిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. వివిధ శాఖల పనితీరుపై సమీక్ష జరిపారు. లంకపల్లి రైస్ మిల్లు యజమాని రైతులకు ధాన్యం నగదు చెల్లించడం లేదని ఫిర్యాదులు వచ్చాయని, నగదు చెల్లించేలా చర్యలు తీసుకొంటామన్నారు. వచ్చే సంవత్సరం ఈ మిల్లును బ్లాక్ లిస్ట్‌లో పెడతామని తహసీల్దార్ రాజ్యలక్ష్మి తెలిపారు. ఫత్తేలంకలో రీసర్వే జరుగుతుందని చెప్పారు. 22ఏలో ఉన్న అసైన్డ్‌భూములను జాబితా నుంచి తొలగిస్తామని, ఏవైనా సమస్యలుంటే తనను సంప్రదించాలని ఎమ్మెల్యే తెలిపారు. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు 6,800 ఎకరాల్లో పంటనష్టం జరిగిందని ఏవో గణేష్‌రెడ్డి చెప్పారు. అధికారులు వారి శాఖల పనితీరును వివరించారు. సమావేశంలో ఎంఈవో శ్రీనివాస్, ఏఈలు వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పక్కన ప్రజాప్రతినిధులు

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: నియోజకవర్గంలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ నిర్దేశిత లక్ష్యాలను అధిగమించాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. కైకలూరు పార్టీ కార్యాలయంలో గురువారం ఉదయం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం, గృహనిర్మాణం, మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, రెవెన్యూ శాఖల పనితీరును, మధ్యాహ్నం నుంచి నీటిపారుదల, మురుగునీటి పారుదల, రహదారులు భవనాలు, విద్యుత్ శాఖల పనితీరును సమీక్షించారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు ఆయా శాఖాల్లో జరిగిన పనులను తెలుసుకున్నారు. పెండింగ్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఆయా మండలాల ఎంపీపీలు ప్రధాన సమస్యలను ప్రస్తావించారు. వాటి పరిష్కారాలపై నిర్ణయాలు తీసుకున్నారు. ఎంపీపీలు అడివి కృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు, తహసీల్దార్లు శ్రీనివాస్, వంశీ, రాజ్ కుమార్, పీఆర్ డీఈఈ సురేష్ బాబు, ప్రాజెక్ట్స్ డీఈఈ రవి కుమార్, హౌసింగ్ డీఈఈ రమణ మూర్తి, ఎంపీడీఓలు రాంబాబు, రమణ బాబు, ఏపీఓలు శరణ్, దేవానంద రాజు, ఆనంద్, ఆయా శాఖల ఇంజినీర్లు హాజరయ్యారు.



కైకలూరులో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

పశు వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం పశు సంరక్షణకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడంతో పాటు పశువులకు అవసరమైన వసతులు అన్ని పశువైద్యశాలల్లో అందుబాటులో ఉంచారని పశు సంవర్థక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ఎంఎస్ఏ దివాకర్ అన్నారు. స్థానిక మెయిన్ రోడ్డులోని వెటర్నరీ పాలి క్లినిక్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పశుపోషకులతో మాట్లాడి ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సేవలు, వైద్యుల పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. గతంతో పోలిస్తే ప్రస్తుతం పశువైద్యశాలల్లో వసతులు మెరుగు పడ్డాయన్నారు.

ఇష్టంతో చదివితే ఉన్నత శిఖరాలు

వెంట్రప్రగడ(పెదపారుపూడి): ప్రతి విద్యార్థి చదువును ఇష్టంతో చదివితే జీవితంలో కచ్చితంగా ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని మండల ప్రత్యేకాధికారి ఎంఎస్ఏ దివాకర్ అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ హైస్కూల్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. పది తరగతి విద్యార్థులను పలు అంశాలపై ప్రశ్నలు అడిగి, సమాధానాలు రాబట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదలతో చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కిషోర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న డాక్టర్ దివాకర్

గద్దర్ మృతి తీరని లోటు

పామర్రు: ప్రజా నాయకుడు గద్దర్ మృతి తీరని లోటు అని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక అంబేడ్కర్ భవన్ కార్యాలయంలో గురువారం గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదల అభ్యున్నతి కోసం ఎన్నో పాటలను పాడి, వారికి న్యాయం జరిగే వరకు పోరాటాలు చేశారన్నారు. పేదల కోసం చేసే ప్రతి పోరాటంలో ముఖ్య పాత్ర పోషించేవారని గుర్తు చేశారు. నాయకులు పచ్చిగళ్ల దేవానందరావు, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఆర్ వెంకటేశ్వరరావు, జువ్వనపూడి సురేంద్రకుమార్, ఆవుల ప్రవీణ్, తాడిశెట్టి శ్రీనివాసరావు, హస్మతుల్లా, శ్రీనివాసరావు, సుబ్రమ్మణ్యం, మనోహర్ పాల్గొన్నారు.



అమర వీరులను స్మరించుకోవడం మన విధి

కైకలూరు: నా భూమి - నా దేశం కార్యక్రమం ద్వారా నేల తల్లికి నమస్కారం - వీరులకు వందనం అర్పించడం భారతీయులుగా మన విధి అని ఎమ్మెల్యే దూలం డీఎన్నార్ అన్నారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవాల్లో భాగంగా కైకలూరు మండలం దొడ్డిపట్ల గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నా భూమి నా దేశం శిలాఫలకాన్ని గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మొక్క నాటారు. ఎంపీపీలు అడవి వెంకటకృష్ణ, పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్, చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు, కోరుకొల్లు పీఏసీఎస్ అధ్యక్షుడు వడుపు రామారావు, ఉపసర్పంచ్ సురేష్, పార్టీ కార్యకర్తలు, ఆశ వర్కర్లు, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం అరిపిరాల గ్రామంలో నా భూమి - నా దేశం, నా తల్లికి నమస్కారం వీరులకు వందనం వేడుకలు నిర్వహించారు. ఎంపీటీసీ గోవాడ నిర్మల కుమారి ఆధ్వర్యంలో విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఎంపీడీవో కేవీ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: స్వాతంత్య్రం కోసం ప్రాణాలు అర్పించిన అమర వీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీపీ గద్దే పుష్పరాణి పేర్కొన్నారు. మండల పరిధిలోని వలివర్తిపాడు సచివాలయం వద్ద నా భూమి - నా దేశం కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా గురువారం పాల్గొన్నారు. ముందుగా జాతీయ జెండాను ఎంపీపీ ఆవిష్కరించారు. విద్యార్థులతో మొక్కలు నాటి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, ఎంపీడీవో వెంకటరమణ, ఏవో బి.అనంతలక్ష్మి, నాయకులు శాయిన నాగబాబు, రవి, చింతా శ్రీనివాసరావు, కలపాల కిరణ్, గద్దే రాము, పంచాయతీ కార్యదర్శి అనూల, ఈసీ జి.రామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గ్రామస్తులు, చిన్నారులు పాల్గొన్నారు. బిళ్లపాడు గ్రామంలో నిర్వహించిన నాభూమి నాదేశం కార్యక్రమంలో తహసీల్దార్ కె.ఆంజనేయులు ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. బొమ్ములూరులో జరిగిన కార్యక్రమంలో ఎంఈవో శేఖర్‌సింగ్ పాల్గొన్నారు. సైదేపూడిలో పంచాయతీ రాజ్ ఎఈ రామ్మోహనరావు పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించి మొక్కలు నాటారు. ఆయా కార్యక్రమాల్లో సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, పంచాయతీ కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూషణగుళ్ల(పెదపారుపూడి): మట్టిని కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరూ కాపాడుకుందామని తహసీల్దార్ వి.నాగభూషణం అన్నారు. మండలంలోని భూషణగుళ్ల గ్రామంలో నాభూమి-దేశం కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ మండల వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ కన్వీనర్ దొండపాటి రాంబాబుతో కలిసి నిర్వహించారు. అనంతరం మొక్కలను నాట్టారు. వీఆర్వో భగవంతరావు, గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శి విజయ్‌పాల్గొన్నారు.

పామర్రు: ప్రతీ ఒక్కరూ దేశ భక్తిని పెంపొందించుకోవాలని పామర్రు ఎంపీపీ అశోక్‌కుమార్ అన్నారు. ఆజాదీ కా అమృత మహోత్సవ్ కార్యక్రమాన్ని పసుమర్రు గ్రామంలో గురువారం నిర్వహించారు. శిలాఫలకం ఆవిష్కరించి, పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీవో రామకృష్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: దేశం కోసం ప్రాణ త్యాగం చేసిన అమరుల త్యాగాలను ఎన్నటికీ మరువబోమని తహసీల్దార్ కుసుమకుమారి అన్నారు. ఆజాదీకా అమృత మహోత్సవ్‌లో భాగంగా నా భూమి - నా దేశం కార్యక్రమం గురువారం ఘనంగా జరిగింది. సర్పంచ్ పెనుమత్స రాధిక ఆధ్వర్యంలో అమరుల శిలాఫలకాన్ని కుసుమకుమారి ఆవిష్కరించటంతో పాటు జాతీయ పతాకాన్ని ఎగురవేసి మట్టిదీపాలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మొక్కలు నాటారు. పంచాయతీ కార్యదర్శి పుష్పనాథం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.